సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 21-2-2025
సంపుటి: 20 సంచిక: 280
పేజీలు: 8 వెల: రూ.1

## మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటా కొనుగోళ్లకు చర్యలు

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

(సత్యంన్యూస్, టెక్కలి)

రాష్ట్రంలో టమాటా రైతుల నుంచి ప్రభుత్వమే మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోళ్లు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇందుకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి మండలంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తొలుత పలు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా టమాటా కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే నేరుగా రైతు బజారుల్లో - మిగతా చివరి పేజీలో






# భయపెట్టుకో.. బేరం కుదుర్చుకో!



- ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవోదే అక్కడ హవా
- సస్పెండ్ చేస్తానంటూ బెదిరింపులు
- బేరం కుదిరాక పంపకాలు
- అన్ని ప్రాజెక్టులపైనా ఆజమాయిషీ
- పీజీ రిలీవ్ కోసం వసూళ్లు
- కులం, రాజకీయం కలిపి సవారీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**“ మీ పీహెచ్‌సీలో ఇమ్యూనైజేషన్ శాతం ఎందుకు ఇంత తక్కువ ఉంది? ఆర్‌సీహెచ్ ప్రోగ్రాంలో చైల్డ్ హెల్త్‌కేర్ చూడమంటే మీ మండలంలో రక్తహీనత ఉన్న బాలికలు ఎందుకు కనిపిస్తున్నారు? కిశోర బాలిక సంరక్షణ కింద ఏం చేస్తున్నారు? టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ కేసులకు సంబంధించిన రికార్డులు తీసుకురండి. ఒక్కరు కూడా సరిగ్గా పని చేయడంలేదు. మీ అందర్నీ సస్పెండ్ చేస్తా.. ఖబడ్దార్! ”**

..అంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల రెచ్చిపోతున్న అధికారి కొత్తగా వచ్చిన డీఎంహెచ్‌వో అనుకుంటే తప్పులో కాలేసినట్టే. పోనీ ఈ బెదిరిస్తున్న అధికారైనా వ్యవస్థను గాడిలో పెట్టడానికి ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా.. అంటే అదీ లేదు. అటు డీఎంహెచ్‌వో, ఇటు ఈ హల్‌చల్ వైద్యుడు కలిసి క్విడ్ ప్రో కో పద్ధతిలో 30:70 నిష్పత్తిలో సొమ్ములు పంచుకోవడం కోసం కలిసి ఆడుతున్న నాటకమిది. ఇంతా చూస్తే జిల్లాలో అమలవుతున్న నాలుగు ప్రోగ్రామ్‌లకు నలుగురు అధికారులు ఉండగా, అందులో అర్బన్ పీహెచ్‌సీలను పర్యవేక్షించే డీపీఎంవో ఈయన. అలాగే ఇమ్యూనైజేషన్ ప్రాజెక్టుకు ఒకరు, ఆర్‌సీహెచ్ ప్రాజెక్టుకు మరొకరు, ఆర్‌బీఎస్‌కేకు ఇంకొకరు, టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్‌కు మరొకరు ప్రోగ్రాం మేనేజింగ్ ఆఫీసర్లు ఉంటారు. వీరందరి పనితీరును పర్యవేక్షించాల్సింది జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి. కానీ నిండా 35 ఏళ్ల వయసు దాటని ఒక వైద్యాధికారి కుసిమి పీహెచ్‌సీలో వైద్యుడిగా పని చేస్తూ నాలుగున్నర సంవత్సరాలైన తర్వాత ఫారెన్ సర్వీస్ కింద డీఎంహెచ్‌వో ఆఫీసుకు ఎన్‌హెచ్‌ఎం ప్రాజెక్టుకు డీపీఎంవోగా జాయినయ్యారు. ఇప్పుడు ఆ డీపీఎంవో డాక్టర్ బి.రవీంద్ర కథే ఇప్పుడు మనం చెప్పుకుంటున్నాం. సాధారణంగా కుసిమిలో వైద్యుడిగానో, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవోగానో మాత్రమే వ్యవహరించివుంటే ఈ కథనం అవసరం వచ్చివుండేది కాదు. కానీ జిల్లాకు ఇటీవల బదిలీల్లో కొత్త డీఎంహెచ్‌వో వచ్చిన తర్వాత ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవో డాక్టర్ బి.రవీంద్ర ఇప్పుడు వైద్య ఆరోగ్య శాఖలో షాడో డీఎంహెచ్‌వోగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ఈయన నగరంలో ఉన్న ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లు, పలాసలో ఉన్న రెండు, ఇచ్ఛాపురంలో ఉన్న మరో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు కలిపి మొత్తం 10 అర్బన్ హెల్త్ సెంటర్లను పర్యవేక్షించాల్సి ఉంది. కానీ డీఎంహెచ్‌వో అండదండలు పుష్కలంగా ఉండటంతో ఆయన రూరల్ పీహెచ్‌సీలకు కూడా వెళ్లి ఆజమాయిషీ చెలాయిస్తున్నారు. అక్కడ జరిగే వివిధ కార్యక్రమాలను పరిశీలించినట్టు నటించి అందరి మీదా ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేస్తానంటూ భయపెడుతున్నారు. సాధారణంగా వైద్య ఆరోగ్యశాఖ అంటేనే ఖర్చులు, టార్గెట్‌లు కాగితాల మీద నడిచే శాఖ. ఇక్కడ దేనికీ ఒక లెక్కాపత్రం ఉండదు. దీనికి తోడు జాతీయ స్థాయిలో నిధులు సమకూరుతుండటం వల్ల వాటికి ఖర్చు చూపించడం కోసం కిందిస్థాయిలో ఏదో ఒకటి చేస్తుంటారు. అటువంటి చోట అక్రమాలు బయటకు తీసి చర్యలకు సిఫార్సు చేస్తే బాగుండేది. అలా కాకుండా కేవలం వారిని భయపెట్టి, ఆ తర్వాత బేరం కుదుర్చుకుని తనకు 30 శాతం, డీఎంహెచ్‌వోకు 70 శాతం కింద డీపీఎంవో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటి వరకు ఆయన ఎన్ని పీహెచ్‌సీలు తనిఖీ చేశారో.. అన్నింటిలోనూ సస్పెన్షన్ బూచి చూపించారు. వీరంతా శ్రీకాకుళంలో డీఎంహెచ్‌వో కార్యాలయానికి రావడం, ఆయన చెప్పిన రేటుకు సెటిల్ చేసుకోవడం మామూలైపోయిందని - మిగతా చివరి పేజీలో

## బలమైన విద్యా విధానం అవసరం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అధికార పార్టీల రాజకీయ విధానాలతో సంబంధం లేకుండా, ప్రభుత్వాలకు స్పష్టమైన ఒక విద్యా విధానం ఉండాలని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు చెప్పారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం ఇస్కఫ్ జిల్లా శాఖ నిర్వహించిన అంతర్జాతీయ భాషా దినోత్సవం ఇస్కఫ్ అధ్యక్షుడు ఎంవి మల్లేశ్వరరావు అధ్యక్షతన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పితృభాషా దినోత్సవం అనకపోవడం వెనక మానవ జీవన సంబంధాలను ధర్మారావు వివరించారు. ప్రపంచంలో ఇంగ్లీష్, మన దేశంలో హిందీ మెజారిటీ భాషలుగా ఉండటానికి కారణం అవి ఉపాధి భాషలు కావడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. మాతృభాషలో ఉన్న మానవీయ మాధుర్యం మరో భాషలో ఉండదని తెలిపారు. మన దేశంలోనూ దాదాపు 750 భాషలు ఉండగా, ఇప్పటికే 250 భాషలు అంతరించిపోయినట్టు ఆయన చెప్పారు. ఉపాధి భాషలను గౌరవిస్తూనే, మాతృభాషలను కూడా రక్షించేది ఒక్క విద్యా రంగం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ కార్యదర్శి జీవీ నాగభూషణం, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.ఈశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు ఆదిత్య, మురళీకృష్ణ, పురుషోత్తం, శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.




### మిర్చికి రూ.11,600కు పైగా

## మద్దతు ధర ఇవ్వాలని కోరాం

**- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు -**



**న్యూఢిల్లీ:** ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మిర్చికి రూ.11,600 పైగా మద్దతు ధర ఇవ్వాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశామన్నారు. ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. మిర్చి ఎగుమతులు, ఏపీ మిర్చికి అంతర్జాతీయ మార్కెట్ కల్పించే అంశంపై భేటీలో చర్చించామని, సమస్య చెప్పిన వెంటనే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పందించారని తెలిపారు. ఎగుమతిదారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని, మార్కెట్ ధర, ఉత్పత్తి ఖర్చుకు మధ్య తేడా పరిశీలిస్తామని చెప్పారన్నారు. ఏపీలో మిర్చి రైతులు కష్టాల్లో ఉన్నారని చెప్పామని, రాయలసీమ, గుంటూరు, పల్నాడు జిల్లాల మిర్చి రైతులకు లబ్ధి కలిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి శివరాజ్‌సింగ్ హామీ ఇచ్చినట్టు రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

## 'పద్మావతి'లో మాతృభాషా దినోత్సవం



(సత్యంన్యూస్, నరసన్నపేట)

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని పద్మావతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'అమ్మభాషను ఆదరిద్దాం' అనే అంశంపై కళాశాల తెలుగు అధ్యాపకులు మాట్లాడుతూ మాతృభాష ఒక జాతి మనుగడకు పునాది, సంస్కృతి సంప్రదాయాలు తర్వాత తరాలకు అందించే వారధి అని వివరించారు. మన మాతృభాష తెలుగు గొప్పతనం గూర్చి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి మూకళ్ల శ్రీనివాసరావు, చరిత్ర అధ్యాపకులు వై.పద్మనాభం, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు.




## నాగరిక చరిత్రలో గ్రంథాల పాత్ర గొప్పది



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మానవ నాగరిక చరిత్రలో గ్రంథాలు నిర్వహించిన పాత్ర ఎంతో గొప్పదని వాణిజ్యవేత్త నాగేశ్వర సాయిరాజ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఒక ప్రైవేట్ సమావేశ మందిరంలో జరిగిన 'రెడ్ బుక్ డే' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. పుస్తకం ముద్ర లేని జీవితం దాదాపు ఇప్పుడు ఎక్కడా లేదని ఆయన అన్నారు. కవులు, రచయితలు, పరిశోధకులు రచించిన పుస్తకాల ముద్రణకు, కొనుగోలుకు సమాజంలో ఆర్థికంగా స్థితిపరులైన దాతలు సహకరించాలని, అలా చేయడం వల్ల వారికి ఎంతో గౌరవం లభిస్తుందని సాయిరాజ్ అన్నారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎంవి మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా అవార్డు గ్రహీత నల్లి ధర్మారావు మాట్లాడుతూ ముద్రణ, కొనుగోలు బాధ్యతలను జిల్లా గ్రంథాలయ సంస్థలు చూసేవని, ప్రభుత్వాల నిర్లక్ష్యంతో గ్రంథాలయ వ్యవస్థ బలహీనమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభావంతులైన కవులు, రచయితలు, పరిశోధకులు ఆర్థిక ఇబ్బందుల వల్ల తమ రచనలను ముద్రించుకునే స్థితిలో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిరాజ్ చెప్పిన అభిప్రాయాలు తమ వంటి వారికి ఎంతో ఉత్సాహాన్ని అందిస్తున్నాయని అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా రెడ్‌బుక్ డే ప్రాధాన్యతను, ప్రభావాన్ని ధర్మారావు వివరించారు. ఈ సందర్భంగా మార్క్స్, ఎంగెల్స్ రచించిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక పుస్తకాన్ని సాయిరాజ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ నాయకులు నాగేశ్వర ఈశ్వరరావు, ఎంవీ మల్లేశ్వరరావు, కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

## రోస్టర్ క్లియర్ చేశాకనే మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం స్థానిక గ్రంథాలయ ఆవరణలో గ్రూప్-2 అభ్యర్థులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ జీవిత కల చెదురుతుందని, ఎన్నో ఏళ్లుగా గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతున్నామని, ఏ ఉద్యోగం లేకుండా ఇన్నాళ్లు కష్టపడి చదువుతూ నిరుద్యోగంతో గడిపామని, 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో జీవో 77 (2-8-2023) ప్రకారం రిజర్వేషన్ కేటాయించలేదని, జీవో 77 ప్రకారం ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్‌లో మాత్రమే స్త్రీల కోట, పీడబ్ల్యుడీ, ఎక్స్-సర్వీస్, స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్స్ కేటాయించాలని, అలా కాకుండా ఈ నోటిఫికేషన్‌లో పాత పద్ధతి ప్రకారం రిజర్వేషన్స్ కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా నిన్న గ్రూప్-2 రోస్టర్ మిస్టేక్స్‌పై వేసిన హైకోర్ట్ తీర్పులో రీడ్రా రోస్టర్ పాయింట్స్ అని చెప్పడం జరిగిందని, దీనికారణంగా గ్రూప్-2 మెయిన్స్ ఎగ్జామ్ రోస్టర్ క్లియర్ చేయకుండా మెయిన్స్ ఎగ్జామ్ కండక్ట్ చేస్తే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రూప్-2 నోటిఫికేషన్ రద్దయ్యే అవకాశం ఉందన్నారు. కావున ప్రభుత్వం రోస్టర్ క్లియర్ చేశాకనే మెయిన్స్ ఎగ్జామ్ పెట్టాలని గ్రూప్-2 అభ్యర్థులు డిమాండ్ చేస్తూ తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్-2 అభ్యర్థులు పి.నవీన్, జి.సునీంద్ర, టి.జగదీష్, ఎం.అరవింద్, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



• ఎడిటోరియల్

# చట్టాలు పెట్టుబడిదారుల కోసమేనా..?

చట్టాలన్నీ ఉన్నోళ్ల చుట్టాలేననేది మనం తరచూ వింటున్న మాటే కాదు, పదే పదే నిజమవుతున్న మాట కూడా. అయితే చీకట్లో దీపంలా ఈ చట్టాలను ప్రజాపక్షం చేస్తున్న ఘటనలూ లేకపోలేదు. కానీ ఇలాంటివి బహు అరుదు. ప్రగతిశీల, వామపక్ష శక్తుల పాలనలో తప్ప బూర్జువా పార్టీల పాలనలో వాటిని చూడలేం. ఇటీవల వెలువడిన తాజా వార్తలు కొన్ని దీన్ని మరోసారి రుజువు చేస్తున్నాయి. అందులో మొదటిది.. అమెరికాలో విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం (ఎఫ్‌సీపీఏ-1977) అమలును నిలిపివేయడం. రెండవది.. ఒక సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఏకంగా సరిహద్దు భద్రతా నిబంధనలనే సవరించడం. మూడవది.. శ్రీలంకలోని పవన విద్యుత్ ప్రాజెక్టుల నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ వైదొలగడం. ఈ మూడు వార్తలూ భారత అపర కుబేరుడు అదానీకి సంబంధించినవే కావడం గమనార్హం. సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం ఆంధ్రా, ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీరు అధికారులకు అదానీ గ్రీన్ సంస్థ రూ.2,100 కోట్లు ముడుపులుగా ఇచ్చిందని, లంచాల వ్యతిరేక చట్టాలకు కట్టుబడి ఉంటామని ఇచ్చిన హామీని అతిక్రమించి ఈ ప్రాజెక్టుల కోసం అమెరికాలో రుణసేకరణ చేసిందని.. గతేడాది నవంబరులో జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా న్యాయశాఖ గుర్తించడం, ఆమేరకు తమ విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం కింద కేసులు నమోదు చేయడం తెలిసిందే. కానీ అమెరికా తాజా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఏ చట్టం కింద అదానీని ప్రాసిక్యూట్ చేయాల్సివుందో ఆ చట్టం అమలునే ఇప్పుడు నిలిపివేశారు. ఈ కేసులతో స్వదేశంలో, విదేశాల్లో తీవ్ర ఇరకాటంలో పడిన అదానీకి భారీ ఊరట కలిగించారు. సరిగ్గా మోదీ ఆమెరికా పర్యటనకు ముందే ఈ చర్య చోటుచేసుకోవడంతో.. ఇది ప్రధాని ఆప్తమిత్రుడైన అదానీ కోసం ట్రంప్ ఇచ్చిన 'అడ్వాన్స్ గిఫ్ట్' అంటూ వెల్లువెత్తుతున్న విమర్శలు సత్యదూరమేమీ కాదు. నరేంద్ర దామోదర మోదీ, డొనాల్డ్ ట్రంపుల 'అపూర్వ మైత్రి' కారణంగా అదానీకి లభించిన ఈ ఉపశమనం.. పొట్టకూటికోసం అమెరికా వెళ్లిన అసంఖ్యాకులైన వలసదారులకు లభించకపోవడం వైచిత్రి! ఇదిలా వుంటే భారత ప్రభుత్వమేమైనా తక్కువతిందా.. ఇదే అదానీకి చెందిన సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం సరిహద్దు భద్రతా నిబంధనలనే సవరించేసింది! ఈ విషయమై 'గార్డియన్' పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. అదానీ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద సౌర విద్యుదుత్పత్తి ప్లాంటును గుజరాత్‌లోని ఖావ్‌డాలో నిర్మిస్తోంది. 2020 లో ప్రధాని మోదీ స్వయంగా ఈ ప్రాజెక్టును ఆవిష్కరించారు. అయితే, రక్షణ శాఖ నిబంధనల ప్రకారం దేశ సరిహద్దు నుంచి పది కిలోమీటర్ల వరకు ఎలాంటి భారీ ప్రాజెక్టులు, నిర్మాణాలు, రోడ్లు నిర్మించడానికి వీల్లేదు. కానీ ఈ ఖావ్‌డా ప్రాజెక్టు పాకిస్థాన్ సరిహద్దుకు కేవలం కిలోమీటరు దూరంలోనే ఉంది. అయినప్పటికీ అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలే ఉండటంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులను, భూములను కేటాయించటమేగాక.. కఠినమైన జాతీయ భద్రతా నిబంధనలను కూడా సవరించాయని 'గార్డియన్' తన కథనంలో పేర్కొంది. ఇలా కేవలం ఒక వ్యక్తి కోసం చట్టాల అమలును నిలిపివేయడం, భద్రతా నిబంధనలనే సవరించడం సంపన్నుల కోసం తప్ప సామాన్యుల కోసం సాధ్యమవుతుందా? మిశ్రమ ఆర్థికవ్యవస్థతో మొదలైన స్వతంత్ర భారత ప్రస్థానం.. కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ స్వాగతాలు పలికే దశకు చేరుకుంది. దేశానికి కీలకమైన రంగాల్లో ఒకప్పుడు ప్రభుత్వమే కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు ప్రపంచీకరణ, సరళీకరణ పేరుతో పూర్తిగా ఆ కాడిని పక్కన పడేశాక బడా కార్పొరేట్లదే రాజ్యమైపోయింది. కోటానుకోట్ల పెట్టుబడులతో దేశ ఆర్థికవ్యవస్థను, ప్రభుత్వాలనే శాసించే స్థాయికి అవి విస్తరించాయి. ఈ తిమింగలాల ధాటిని తట్టుకుని నిలబడగల దమ్మూధైర్యం ప్రభుత్వాలకు లేకపోగా, వారి కనుసన్నల్లో మెలుగుతూ వారి అనుకూల విధానాలతో 'జీ హుజూర్' అంటున్నాయనడానికి ఇవి తార్కాణాలు. ఇక మూడవది ఇందుకు భిన్నమైనది. శ్రీలంకలోని పవన విద్యుత్ ప్రాజెక్టుల నుంచి వైదొలుగుతున్నట్టు అదానీ గ్రూపు వెల్లడించింది. లంచాలు ముట్టజెప్పి విద్యుత్ ఒప్పందాలు చేసుకుందని అదానీ గ్రూపుపై అమెరికాలో కేసులు నమోదవడమేగాక, ఈ ప్రాజెక్టుల కోసం భారత ప్రధాని మోదీ గత శ్రీలంక ప్రభుత్వాలను పరోక్షంగా ప్రభావితం చేశారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ దేశ నూతన అధ్యక్షుడు, వామపక్ష నేత దిసనాయకే ప్రభుత్వం అదానీ సంస్థతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు ప్రకటించింది. అవినీతిని నిర్మూలించి, దేశాన్ని వృద్ధి పథంలో నడిపిస్తాననే హామీకి అనుగుణంగా అదానీ ప్రాజెక్టులపై సమీక్ష ప్రారంభించింది. ఇది అదానీ గ్రూప్‌నకు ఊహించని భారీ ఎదురుదెబ్బ. అందుకే అదానీ గ్రూపు తాజాగా శ్రీలంకలో విద్యుత్ ప్రాజెక్టుల నుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయినా అదానీ గ్రూప్ కంపెనీలు ప్రతిపాదిస్తున్న ఖర్చులో దాదాపు మూడింట రెండొంతుల ధరకే చిన్నచిన్న పునరుత్పాదన ఇంధన సంస్థలు విద్యుత్తును అందిస్తుంటే.. అదానీతో అంటకాగడానికి అదేమీ మోదీ సర్కారు కాదు కదా..! ప్రజాపక్షం వహించే ఏ ప్రభుత్వమూ అలా చేయదని శ్రీలంక ప్రభుత్వం నిరూపించింది. చట్టాలు అసంఖ్యాకులైన ప్రజల ప్రయోజనం కోసమా? లేక గుప్పెడుమంది పెట్టుబడిదారుల కోసమా? అన్నది వాటిని ఉపయోగించే పాలక పార్టీల వర్గస్వభావాన్ని, విధానాలను బట్టి ఉంటుందనడానికి ఇదో నిదర్శనం.

పరీక్షలు రాయబోతున్న

# పదవ తరగతి విద్యార్థులకు నా మాట

సవర రామకృష్ణ, 7997228647 ✍




✍ పరీక్షలనేవి మీరు ఈ ఏదాది కాలంలో ఏం చదివారు ఏం నేర్చుకున్నారు అనేది తెలుసుకోవడం కోసమే తప్ప మిమ్ముల్ని మీ తెలివితేటలని నిర్ణయించడానికి అంచనా కట్టడానికి మాత్రం కానే కాదు.

✍ పరీక్షలు జరుగుతున్న ప్రతిరోజు మీ ఇంటిలో తెల్లవారుజామున నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు అలాగే సాయంత్రం ఆరు గంటల నుండి 10 గంటల వరకు మీరు ఏదాది కాలంలో ఏమి చదివారో అవి మాత్రమే రివిజన్ చేసుకోవాలి కొత్త విషయాల జోలికి వెళ్లి చదవొద్దు.

✍ పరీక్ష సమయంలో ఒక రోజుల్లో ఆరు నుండి 7 గంటల నిద్ర అనేది కనీసం ఉండాలి.

✍ పరీక్ష ముందు రోజు వీలైనన్ని మోడల్ పేపర్లు సాధన చేయాలి రివిజన్ చేయాలి అలాగే ఏపీఎస్‌సీఈఆర్‌టీ ముఖ్యమైన ప్రశ్నలు అన్ని రివిజన్ చేసి చదవాలి.

✍ పరీక్ష రాస్తున్న ప్రతి నిమిషం ప్రతి లైను ప్రతి పేరాగ్రాఫ్ క్షుణ్ణంగా మంచి హ్యాండ్ రైటింగ్‌తో సబ్జెక్టును ఇష్టపడుతున్నట్టు ప్రేమిస్తున్నట్టు పరీక్ష రాయాలి. అప్పుడే పరీక్ష పేపర్ రుద్దేవారు సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ కాబట్టి తనలాగే మీరు కూడా ఆ సబ్జెక్టుని ఇష్టపడి పరీక్ష రాస్తున్నారు అని భావించి మంచి మార్కులు వేస్తారు.

✍ పరీక్షకు ఉపయోగించే ఫ్లవర్లు బొమ్మలు ఉండే ప్యాడ్, బ్లూ మరియు బ్లాక్ పెన్ను మాత్రమే తీసుకొని వెళ్ళాలి అలాగే హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నెర్, స్కేలు కూడా తీసుకెళ్లాలి. పెన్నులు మీరు రెండు రోజులు ముందు వాడినవి మాత్రమే తీసుకెళ్లాలి కొత్త పెన్నులు తీసుకు వెళ్ళకూడదు వాడిన పెన్నులు తీసుకెళ్లడం వల్ల హ్యాండ్ రైటింగ్ స్పీడ్ పెరుగుతుంది.

✍ పరీక్షకు వెళ్లే ముందు టిఫిన్స్ / స్నాక్స్ వంటి నూనె వంటలు తినవద్దు కేవలం గంజి అన్నం లేదా ఇడ్లీ (పెరుగు వద్దు) మాత్రమే తినాలి.

✍ హాల్ టికెట్స్ మర్చిపోవద్దు దానికి కవర్ ఉంటే ఇంకా మంచిది.

✍ పరీక్ష కెళ్ళే ముందు ఏటువంటి పిచ్చి సెంటిమెంట్లు నమ్ముకోవద్దు నిన్ను నువ్వు నమ్ముకుని పరీక్ష రాయాలి.

✍ వాటర్ బాటిల్‌తో నీరు ముఖ్యంగా తీసుకువెళ్లాలి.

✍ పరీక్ష ప్రారంభించే ముందు వాటర్ బాటిల్‌లో నీరు తాగి రెండు నిమిషాలు నిశ్శబ్దంగా కళ్ళు మూసుకుని గట్టిగా ఊపిరి పీల్చుకొని వదిలి కళ్ళు తెరిచి మీ భవిష్యత్తు కోసం మొదటి మెట్టు ఎక్కడానికి మీరు రాసే పరీక్షలను మీమీద మీకు ఉన్న గట్టి విశ్వాసంతో ప్రారంభించండి.

✍ ఒకటి గుర్తుపెట్టుకోండి జీవితంలో గెలుపోటములు సర్వసాధారణం గెలుపు వచ్చింది అని గర్వంతో ఓడిపోయామని అవమానంతో ఉండవద్దు గెలుపు ఐనా ఓటమి ఐనా తటస్థంగానే ఉండాలి.

✍ పరీక్ష పేపర్లో క్వశ్చన్ నెంబర్లు రాయడం మర్చిపోవద్దు. ప్రతి ప్రశ్న రాసేటప్పుడు దానికి జవాబు (తెలుగు జ అని ఇంగ్లీషు Ans అని హిందీ అయితే హిందీలో 'జ' అని మ్యాథ్స్ అంటే Sol అని) రాయాలి.

✍ పరీక్ష రాస్తున్నప్పటి నుంచి పూర్తి అయ్యే దాకా కంగారు పడవద్దు మూడు గంటల సమయాన్ని మీరు ఉపయోగించుకోండి.

✍ మూడు గంటల 15 నిమిషాలలో 15 నిమిషాలు పేపర్ చదవడానికి కేటాయిస్తారు ఆ 15 నిమిషాలు పేపరు క్షుణ్ణంగా చదివి జవాబులు రాయండి.

✍ ఎగ్జామ్స్‌లలో ఫ్యాషన్ డ్రెస్సెస్ కాకుండా ఫార్మల్ డ్రెస్సెస్ మాత్రమే వేసుకోవాలి అందులోని డార్క్ కాకుండా లైట్‌కలర్ ఉండేవి వేసుకుంటే ఇంకా మంచిది వాటి వల్ల మీ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

✍ ప్రతి జవాబులు ముఖ్యమైన ఒక పాయింట్‌కి పెన్సిల్తో అండర్లైన్ చేయాలి.

✍ ప్రతిరోజు నీళ్ళు కొంచెం ఎక్కువగా తాగండి. సరైన ఆహారం తీసుకోండి.

ఆల్ ది బెస్ట్ స్టూడెంట్స్!!

# ఆడవరంలో అక్షరవృక్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆడవరంలో ప్రధానోపాధ్యాయులు భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృబాషాదినోత్సవం సందర్భంగా తెలుగు కవులు,, అక్షరమాలతో ప్రత్యేకంగా అక్షరాల వృక్షం తయారుచేసి మాతృభాష దినోత్సవ విశిష్టత విద్యార్థులకు తెలియజేశారు. సందర్భంగా కేసిని, గాయత్రి, మేఘన, మనస్వి,, గగణ,, జెస్సిక తదితరులు తెలుగుతల్లి వేషధారణలో ఎంతగానో అలరించారు. ఈ సందర్భంగా సహాయ ఉపాధ్యాయులు సోనిమి పాపారావు తదితరులు పాల్గొన్నారు.



శిష్టకరణం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడిగా

# సదాశివుని రవికుమార్ ఎన్నిక


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఉత్తరాంధ్రలోని బలమైన సామాజికవర్గంగా ఉన్న శిష్టకరణం సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడానికి శిష్టకరణం ఫౌండేషన్ ఏర్పడిందని, అటువంటి ఫౌండేషన్ శిష్టకరణం కుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న సదాశివుని రవికుమార్ సేవలను గుర్తించి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షునిగా ఆయనను ఎన్నుకున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మానాపురం సురేష్‌కుమార్ ప్రకటించారు. సదాశివుని రవికుమార్‌కు జిల్లా బాధ్యతలను అప్పగిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఇదే సందర్భంగా ఉపాధ్యక్షులుగా బెహరా రాజేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా నౌపాడ నర్సింగరావు, కోశాధికారిగా డబ్బీరు మానస్ వినోద్‌ను ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలియజేశారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని శిష్టకరణం సామాజిక వర్గాన్ని రాజకీయంగా ప్రాబల్యం గల కులంగా చేయడానికి కృషి చేస్తానని జిల్లా అధ్యక్షులుగా నియమితులైన సదాశివుని రవికుమార్ అన్నారు.

# యాషికా ఆనంద్.. గ్లామర్ డోస్ పెంచుతూనే ఉంది!!

యాషికా ఆనంద్.. ఈ పేరు వింటేనే హాట్‌గాళ్ విత్ టాలెంటెడ్ హీరోయిన్ అన్నది గుర్తుస్తోంది. ఈమె ప్రధానంగా తమిళ సినిమాలు, టెలివిజన్ షోలలో పనిచేస్తుంది. అంతే కాకుండా కోలీవుడ్ పరిశ్రమలో ప్రజాదరణ పొందింది. ఆనంద్ తన చిత్రాలలో తన పాత్రకు ప్రత్యేకమైన గుర్తింపు పొందే విధంగా పాత్రలను ఎంచుకుంటుంది. దీంతోపాటు చాలా చిత్రాల్లో ఆమె ఒక ఫ్యాషన్ ఫిగర్‌గా తనను తాను మలుచుకుంది. ఆమె నటించిన చిత్రాల్లో ఒకటి యానిమేటెడ్ చిత్రం జోంబీ. ఈ చిత్రంలో ఆమె ప్రధాన పాత్ర పోషించింది. 2018లో, చెన్నై టైమ్స్ ఆమెను "టెలివిజన్‌లో అత్యంత ప్రాచుర్యం పొందిన మహిళ"గా గుర్తించింది. 2021లో ఆనంద్ తన నటనా ప్రతిభకు అవార్డును గెలుచుకుంది. బెస్టీ చిత్రంలో ఆమె పాత్రకు గానూ లాస్‌వెగాస్ ఇండిపెండెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ నటి అవార్డును అందుకుంది.



# అసలు నటి అవాలనుకోలేదు కానీ..!!



అందం, అభినయంతో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది తెలుగమ్మాయి రీతూ వర్మ. గతేడాది శ్వాగ్ సినిమాతో ప్రేక్షకులను పలకరించిన రీతూ వర్మ ఇప్పుడు మజాకా సినిమాతో మరోసారి ఆడియన్స్ ముందుకు రాబోతుంది. సందీప్ కిషన్ హీరోగా రీతూ వర్మ నటించిన మజాకా సినిమా ఈ నెల 26న రిలీజ్ కానుంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. మజాకా ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్న రీతూ వర్మ రీసెంట్ గా మీడియాతో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది. మజాకా కథ ఎంతో ఎంటర్టైనింగ్ గా అనిపించిందని, స్టోరీ విన్నంతసేపు నవ్వుతూనే ఉన్నానని చెప్పిన రీతూ, ఈ సినిమాలో తన పాత్రకు ఎంతో ప్రాధాన్యముందని చెప్పింది. మజాకాలో బలమైన భావోద్వేగాలున్నాయని, సినిమాలో సందీప్, తన లవ్ స్టోరీతో పాటూ రావు రమేష్, అన్షు లవ్ ట్రాక్ కు కూడా ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, తండ్రీ కొడుకుల మధ్య ఉన్న బాండింగ్ సినిమాకు కీలకంగా నిలవనుందని చెప్పింది. మజాకాలో లాంటి కొత్త తరహా పాత్ర తానెప్పుడూ చేయలేదని, అందరికీ ఆ పాత్ర చాలా నచ్చుతుందని తెలిపింది. ఈ సినిమా సెకండాఫ్ లో తనకు రావు రమేష్ కు మధ్య ఉండే సింగిల్ టేక్ సీన్ గురించి మాట్లాడుతూ, ఆ సీన్ ను చాలా బాగా చేశానని రావు రమేష్ ఫోన్ చేసి మరీ అభినందించారని, ఆ విషయాన్ని తానెప్పటికీ మర్చిపోలేనని తెలిపింది. తన కెరీర్ విషయంలో రీతూ చాలా హ్యాపీగా ఉన్నానని, అసలు తాను నటి అవాలనుకోలేదని, అయినప్పటికీ తానింత దూరం వచ్చి ఇన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నానని, అది తనకెంతో సంతృప్తినిస్తోందని రీతూ చెప్తోంది. నటిగా పలు మంచి సినిమాల్లో భాగమైనందుకు ఆనందపడుతున్న రీతూకి యాక్షన్ బేస్డ్ రోల్స్ చేయాలనున్నట్టు తెలిపింది. కామెడీ సినిమాలంటే కూడా ఇష్టమని అందుకే మజాకా సినిమా ఒప్పుకున్నట్టు చెప్పింది. ఎప్పటికైనా ఫుల్ లెంగ్త్ పీరియాడిక్ మూవీ చేయాలనుందని చెప్పిన రీతూ, ప్రస్తుతం తెలుగులో ఓ మల్టీస్టారర్ ప్రాజెక్టు కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు వెల్లడించింది. అది కాకుండా శ్రీకారం డైరెక్టర్ కిశోర్ దర్శకత్వంలో చేసిన ఓ వెబ్‌సిరీస్ త్వరలోనే రిలీజ్ కానున్నట్టు అమ్మడు తెలిపింది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

ఛావా సినిమా చూశారు కదా, మీ రియాక్షన్ ఏమిటీ అనడిగాను ఓ సినిమా పెద్దాయన్ని..! "విక్కీ కౌశల్ ఓ నటుడిగా ఉన్నతంగా కనిపిస్తున్నాడు. పాత్రల ఎంపిక, వాటి కోసం తపస్సు చేయడం.. మానసికంగా, దైహికంగా తనను తాను ఆ పాత్రలోకి ప్రవేశించడం అంత సులభం కాదు.4 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 164 కోట్లు అనేది పెద్ద ఫిగర్ కాకపోవచ్చు, కానీ ఇప్పటి బాలీవుడ్ దుర్దినాల్లో ఇదొక ఆశారేఖ.. ఓ సాదా సీదా మరాఠీ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఇంత గొప్పగా ఓ సినిమా తీయగలడని అనుకోలేదు



# విక్కీ కౌశల్.. మరాఠీయులకు స్టార్ హీరో

మొదట్లో.. తోడుగా విక్కీ, రష్మిక, అక్షయ్, అన్నింటికీ మించి ఔరంగజేబు కూతురి పాత్ర వేసిన డయానా పెంటీ కూడా ఎక్సలెంట్.. ఒక ఉరి, ఒక సర్దార్ ఉధమ్, ఒక శామ్ బహదూర్, ఇప్పుడు శంభాజీ మహారాజ్.. అందుకే విక్కీ కౌశల్ ఈతరానికి, ప్రత్యేకించి మహారాష్ట్ర మరాఠీయులకు స్టార్ హీరో అయిపోయాడు. దిక్కుమాలిన స్మగ్లర్లు, పీలింగ్స్ వంటి వెగటు స్టెప్పులు కాదు. ఈ తరానికి దేశభక్తి, సైనికుల త్యాగాలు, సాహసాలు, మనకు తెలియని చరిత్ర పాత్రల్ని ఎంపిక చేసుకుని మెప్పించడం అంత సులభం కాదు, కానీ విక్కీ ఆ ఫీట్ సాధించాడు. మన తలతిక్క పాత్రల సూపర్ హీరోయిజం పాత్రల్ని చేసే స్టార్ హీరోలు ఓసారి ఛావా చూడాలి. అసలు హీరోయిజం అంటే ఏమిటో శంభాజీ పాత్ర చెబుతుంది మనకు.. క్రియేటివ్ ఫ్రీడం అంటారు కానీ, నిజానికి శంభాజీని ఔరంగజేబు పెట్టిన క్రూర హింసను దర్శకుడు యథాతథంగా చూపించలేకపోయాడనే అంటాను నేను.. అదే మన తెలుగు చరిత్ర సినిమాలు చూడండి.. వక్రీకరణలు, తిక్క బాష్యాలు, చెత్తా సమర్థనలు.. అల్లూరికీ కుమ్రం భీమ్‌కూ ముడిపెడతారు ఒకరు.. రామదాసునూ కబీర్‌దాసునూ కలుపుతారు.. అంతెందుకు, సైరా క్లైమాక్స్, కథనం చూడండి.. అంతెందుకు, దేవుళ్లకూ పిచ్చి స్టెప్పుల డాన్సులు పెట్టే మన దర్శకుల గురించి ఇంకేం ఆశించగలం..? మన దైవాంశ సంభూతులైన హీరోలు ఒక శంభాజీ పాత్రను కలగనాలి.. వారు చేయగలరా..? ఈ పాత్రకు విక్కీ కౌశల్‌కు జాతీయ అవార్డు దక్కాలి. చివరి ముప్పావుగంట విక్కీ విశ్వరూపం.. థియేటర్లలో జై భవానీ, జై జగదాంబ, హరహరమహదేవ్ అనే ఉద్వేగ నినాదాలు ప్రేక్షకుల నుంచి.. అదీ ఓ నటుడి సక్సెస్ అంటే.. నిజానికి ఛావా నిర్మాతలు ఓ తప్పు చేశారు. పాన్ ఇండియా సినిమాగా రిలీజ్ చేయాల్సింది. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. ఓటీటీ రిలీజులో పలు భాషల ఆడియోలు పెడతారేమో.. కానీ ఇది నిజమైన థియేటరికల్ ఎక్స్‌పీరియన్స్.. భీకరమైన సౌండ్‌తో బాక్సులు పగిలిపోయే బీజీఎం కాదు, థియేటరికల్ ఎక్స్‌పీరియెన్స్ అంటే..! ప్రేక్షకులు కథతో కనెక్ట్ కావడం, ఆ ఎమోషన్ వాళ్లూ అనుభవించడం.. చూశాం కదా యూత్ కూడా ఛావా క్లైమాక్స్ చూసి ఏడుస్తున్న వీడియోలు.. ఓ కథకు, ఓ నటనకు కనెక్ట్ కావడం అంటే అదే.. అన్నింటినీ తేలికగా తీసుకునే నేటి యువతరం కూడా ఛావా చూసి ఏడవడమంటే ఆ దర్శకుడికి ఇంకేం కావాలి..? ఆమధ్య తెలుగులో బలగం సినిమా కూడా అంతే, ఏడిపించింది.." ఇలా సాగిపోయింది ఆయన ఫ్లో!!



ఎంబీఏ చేసిన ఆ కుర్రాడు ఉద్యోగం కోసం వెళ్తే నెలకు రూ.10 వేలు జీతం ఇస్తామన్నారు. ఆ మాటలకు ఖంగు తిన్నాడా కుర్రాడు. తమ టిఫిన్ బండి దగ్గర పనిచేసే వంట మాస్టార్లకే రూ.20-30వేలు ఇస్తుంటే... 'ఉద్యోగం కాదు, వ్యాపారమే కరెక్టు' అనుకుని తండ్రి నడిపే టిఫిన్ బండిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ నిర్ణయం అతడి జీవితాన్నే మార్చేసింది. పదేళ్ల కిందట రోడ్డు పక్కన మొదలైన 'రామ్ కీ బండి' ప్రస్థానం తాజాగా హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరింది.

## ఎం.బి.ఎ.చదివి.. 'రామ్ కీ బండి' ప్రస్థానమిదీ..

# దోసెలబండి పెట్టి..!!

నాంపల్లి రైల్వేస్టేషన్ దగ్గర్లో ఉదయం నాలుగు గంటలపుడు ఒకటే హడావుడి ఉంటుంది. నైట్ డ్యూటీ చేసే ఉద్యోగులూ, యువతా, ప్రయాణికులూ, అటుగా పనిమీద వెళ్లేవాళ్లూ... అక్కడుండే 'రామ్ కీ బండి' దగ్గర ఆగి వేడి వేడి దోసెలు లాగిస్తుంటారు. కొందరైతే సుదూరాల నుంచి దోసె తినేందుకే అక్కడికి వస్తారు. దోసెకే అంత ఇదా అంటే... అదే మరి 'రామ్ కీ బండి' ప్రత్యేకత. బటర్, చీజ్, పనీర్, చీజ్ స్వీట్ కార్న్, పిజ్జా, షెజ్వాన్... ఇలా ఓ డజనుకుపైగా రకాల్లో దోసెలూ... బటర్ కార్న్, చీజ్, తవా ఫ్రై... ఇలా ఓ అరడజను రకాల్లో ఇడ్లీలూ అక్కడ దొరుకుతాయి.

**1989లో మొదలు..**

రామ్ వాళ్ల నాన్న లక్ష్మణరావు షిండే... ఆర్మీలో సిపాయి ఎంపికలు జరుగుతున్నాయంటే 1989లో కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. కానీ ఎంపిక కాలేదు. ఖాళీ చేతులతో ఊరెళ్లడం ఇష్టంలేక బండి మీద టిఫిన్ సెంటర్ నడుపుతూ ఉపాధి పొందేవాడు. నాంపల్లి, పంజాగుట్ట, అమీర్‌పేట్... ఇలా వేర్వేరు చోట్ల రోజంతా బండి తిప్పుతూ ఇడ్లీ, దోసె అమ్మేవాడు. రామ్‌కు ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లెలు. రూ.20 అద్దె చెల్లించి చిన్న గదిలోనే అందరూ ఉండేవారు. రామ్ కూడా చిన్నపుడు బండి దగ్గరకు వచ్చి స్కూల్ టైమ్ వరకూ ఉల్లిపాయలు తరుగుతూ, పాత్రలు శుభ్రం చేస్తూ, ప్లేట్లు అందిస్తూ తండ్రికి సాయం చేసేవాడు. తల్లిదండ్రుల కష్టాన్ని చిన్నప్పట్నుంచీ చూస్తూ వచ్చిన రామ్ ఉద్యోగం చేసి కుటుంబాన్ని ఆర్థికంగా ఉన్నతంగా నిలబెట్టాలనుకుని ఎంబీఏ పూర్తిచేశాడు. కానీ ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాక తెలిసింది, టిఫిన్ సెంటర్‌నే బాగా నడిపి ఎక్కువ సంపాదించవచ్చని. తండ్రి అయిష్టంగానే అంగీకరించాడు. అలా 2010లో టిఫిన్ బండి నిర్వహణ బాధ్యతను తీసుకున్నాడు రామ్.

**ప్రయోగాలు చేశాడు...**

మూడు రకాల దోసెలూ, ఇడ్లీ తప్పించి ఇతర రుచులు ఆ బండి దగ్గర ఉండేవి కాదు. నగరంలో వేలమంది అవే టిఫిన్లను అందిస్తున్నపుడు ఎవరైనా తన బండి దగ్గరకే ఎందుకు రావాలని తనను తాను ప్రశ్నించుకున్నాడు రామ్. ఓసారి పిజ్జా బేస్‌కు కాయగూర ముక్కలూ, చీజ్ జోడించడం చూశాడు. అలా దోసెకు ఎందుకు చేయకూడదన్న ఆలోచన వచ్చింది రామ్‌కి. దాంతో దోసెమీద చీజ్, పనీర్, కూరగాయ ముక్కలు వేసి ప్రయోగం చేశాడు. కానీ అవన్నీ ఉడికే సరికి దోసె మాడినట్లు తయారయ్యేది. తండ్రి సలహాతో దోసెమీద ఉప్మాని పల్చగా వేసి దానిమీద ఇవన్నీ వేయడం మొదలుపెట్టాడు. అప్పుడు దోసెకు అనుకున్న రూపూ, రుచీ వచ్చింది. దాంతో 'రామ్ కీ బండి' దగ్గరకు చాలా బళ్లూ, కార్లూ ఆగడం మొదలైంది. కస్టమర్ల సలహాలూ, సూచనలూ తీసుకుంటూ ఎప్పటికప్పుడు ఉన్నవాటిని మెరుగుపర్చుతూనే కొత్త రుచుల్నీ చేర్చాడు. అదే సమయంలో నగరంలో నైట్ షిఫ్టుల్లో పని చేసేవాళ్లూ, రాత్రిళ్లు ప్రయాణించేవాళ్లనీ చూశాడు. వారికి అనుకూలంగా ఉంటుందని తన బండిని తెల్లవారు జామున మూడింటికే తెరవడం మొదలుపెట్టాడు. రుచి, సమయం 'రామ్ కీ బండి'ని ప్రత్యేకంగా నిలిపాయి. అందుకే అయిదు నిమిషాల్లో 55 దోసెలు అమ్ముడవుతాయక్కడ. ఉదయం తొమ్మిదింటికే దుకాణం మూసేస్తారు కూడా.

ఆ సమయానికే వేల మంది ఆకలి తీర్చుకుంటారు. దోసె ధరలు రూ.50-200 మధ్య ఉంటాయి. ఈ దోసెల రుచికి దాసోహమైన సచిన్, హర్ష్ జైన్ పెట్టుబడికి ముందుకు రావడంతో బేగం బజార్, బేగంపేట్, గచ్చిబౌలి, హైటెక్‌సిటీ ప్రాంతాల్లో 'రామ్ కీ బండి' ఔట్‌లెట్లు తెరిచాడు. బంజారాహిల్స్‌లో 'రామ్స్ దోసె హౌజ్' రెస్టరెంట్‌నూ ప్రారంభించి రెండేళ్లలో లాభాల్లోకి తీసుకొచ్చి దాని నిర్వహణను తన బంధువుకి అప్పగించాడు. ఈమధ్యే హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలోనూ ఓ ఔట్‌లెట్‌ను తెరిచాడు. కానీ ఇప్పటికీ నాంపల్లి బండి దగ్గరే పూర్తి సమయం ఉంటూ, ఆ తర్వాత మిగతా ఔట్‌లెట్లని పర్యవేక్షిస్తాడు. హైదరాబాద్‌లో మరింత మందికి రుచికరమైన దోసెల్ని అందిస్తూనే ఇతర నగరాలకూ విస్తరించడమే తన లక్ష్యం అంటాడు రామ్.



గురువారం పాలకొండ వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డిని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, పాలకొండ**



మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి గురువారం పాలకొండ విచ్చేసిన సందర్భంగా ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను జగన్‌కు వివరించారు.

**- సత్యంన్యూస్, టెక్కలి**



వైకాపా అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి గురువారం పాలకొండ విచ్చేసిన సందర్భంగా ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిన సరుబుజ్జిలి-బూర్జ థర్మల్ పవర్ ప్లాంట్ వలన గిరిజనులకు, జిల్లా ప్రజానీకానికి కలిగే నష్టాన్ని వివరించి, థర్మల్ పవర్ ప్లాంట్ పోరాట కమిటీ సభ్యులతో కలిసి జగనన్నకు వినతిపత్రం అందజేశామని చింతాడ రవికుమార్ తెలిపారు. **- సత్యంన్యూస్, ఆమదాలవలస**

## ఇద్దరు నిందితులు అరెస్టు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సోషల్ మీడియా వేదికగా ఓ మహిళ ఫొటోలు, వీడియాలు మార్ఫింగ్ చేసి వేధిస్తున్న ఇద్దరు నిందితులను శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీసుస్టేషన్ సీఐ పీ.ఈశ్వరరావు ఒక పత్రిక ప్రకటన ద్వారా వివరాలు తెలియజేశారు. ఫిర్యాదురాలు యొక్క ఫొటోలు, వీడియోలను ఎవరు గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ ఇతర సామాజిక మాధ్యమాలు ద్వారా అశ్లీలమైన మార్ఫింగ్‌తో ఆమెను వేధిస్తున్నట్లు శ్రీకాకుళం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అనంతరం ఎస్పీ ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ ఈశ్వరరావు దర్యాప్తులో భాగంగా జిల్లా సైబర్‌సెల్ విభాగం సిబ్బంది సహాయంతో కేసు దర్యాప్తు చేయగా గురువారం పిర్యాదిదారు యొక్క ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాగ్రామ్, మరియు టెలిగ్రామ్ సోషల్ మీడియా వేదిక పోస్టులు పెట్టిన ఇద్దరు వ్యక్తులు షేక్ మహమ్మద్ సోయల్, ఉప్పుగళ్ళ రఘులను గుర్తించి అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా మహిళల ఫోటోలు గాని, వీడియోలు గాని మార్ఫింగ్ చేసి, సోషల్‌మీడియా వేదికగా అసభ్యకరమైన, అనైతిక, విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టి వేధింపులకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు యొక్క ఫోటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు చేయరాదన్నారు.

## అమ్మ భాషపై పట్టు సాధించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అమ్మ బాషపై పట్టు సాధించాలని ఠాగూర్‌పాఠశాల డైరెక్టర్ సాలిహుండం రవికుమార్ అన్నారు. మాతృబాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో తెలుగుబాషపై నిర్వహించిన ప్రదర్శన తిలకించారు. అయిదవ తరగతి విద్యార్థి ఎస్.కావ్య రూపొందించిన గ్రంధాలయం ప్రాజెక్టని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ బెహరా శ్రీదేవి మాతృబాషా దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. కరెస్పాండెంట్ పి.సత్తిబాబు, తెలుగు ఉపాధ్యాయులు సునీత, గుణప్రియ, అంజలి, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, హైస్కూల్. ప్రైమరీ ఇన్‌చార్జ్‌స్ సీతారాం. రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థులకు సువర్ణావకాశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళంలోని జెమ్స్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మూడు, పోస్ట్ బేసిక్ నర్సింగ్‌లో సీట్లు అందుబాటులో కలవని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్‌కు ఇంటర్ బైపీసీ పాస్, పోస్ట్ బేసిక్ నర్సింగ్‌కు జీఎన్ఎం పాసైన వారు అర్హులన్నారు. అభ్యర్థులకు ప్రస్తుతం ఉచితంగా చదివించి, కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం ఇచ్చి, జీతంలో నుంచి ఫీజును మినహాయిస్తామన్నారు. వివరాలకు రాగోలులోని జెమ్స్ కళాశాలలో, 7680945357, 7995013422 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

## 23న రాజాం రచయితల వేదిక సమావేశం

(సత్యంన్యూస్, రాజాం)

రాజాం రచయితల వేదిక (రారవే)ప్రతినెలా జరుపుతున్న కార్యక్రమాన్ని ఈనెల 23 ఉదయం 10 గంటలకు స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు గార రంగనాథం తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షత వహించే ఈ సమావేశంలో 'మాగ్జింగోర్కి-అమ్మ నవల-ప్రాసంగికత' అనే అంశంపై ' సమంతం మహేశ్వరరావు ' ముఖ్య ప్రసంగం చేస్తారు. భాషాభిమానులు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు, సాహిత్య పోషకులు అందరూ హాజరు కావాలని రంగనాథం కోరారు.

## తెలుగు కనబడాలి - తెలుగు వినబడాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగు రాష్ట్రాల్లో తెలుగు కనబడాలని, తెలుగు వినబడాలని పాతపొన్నుటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుర్రాల కృష్ణారావు అన్నారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఇతర భాషలను గౌరవిస్తూనే మన మాతృభాషకు ప్రాధాన్యతనివ్వాలని కృష్ణారావు అన్నారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న బొమ్మాళి నాగేశ్వరరావును ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తెలుగు అంశాలపై నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు అందవరపు రాజేష్, బూడిద సంతోష్ కుమార్, పైసక్కి చంద్రశేఖరం, యిసై సౌజన్యవతి, కుదమ తిరుమలరావులు పాల్గొని ప్రసంగించారు.



## స్కూలు పిల్లలకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సింగుపురం దరి ప్రశాంతినగర్‌లో గల శ్రీ శారద విద్యానికేతన్ ఆవరణలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ ఈసీ మెంబర్ ఎ.ముసలినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెమ్స్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు ఎం.వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని క్యాన్సర్ ఏ విధంగా వస్తుంది, ఎన్ని రకాలు ఉన్నాయి, అవి రాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ముద్దాడ రామ్మోహన్ మాట్లాడుతూ ఇంతటి మంచి కార్యక్రమం నిర్వహించి తమ స్కూలు పిల్లలకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు కల్పించినందుకు పిఎంపి సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వండాన సిమ్మన్న, నక్క లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించుట కోసం పీఎంపీ అసోసియేషన్ తరపున అన్ని జిల్లాల్లో అన్ని గ్రామాల్లో ఈ వ్యాధిపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంత మంచి కార్యక్రమానికి సమయం కేటాయించిన శ్రీ శారదా విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ముద్దాడ రామ్మోహన్‌కు, సహకరించిన ఎ.ముసలినాయుడు, డాక్టర్ వెంకటరమణలకు పీఎంపీ అసోసియేషన్ తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ కె.జనార్దనరావు, జిల్లా జాయింట్ సెక్రెటరీ సీహెచ్ రాములు, కింజరాపు రాజారావు, కె.ఆనందరావు, పీఎంపీ సభ్యులు ఎ.మోహనరావు, పంగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221


## ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోయినది

నేను కెంబూరి అన్నంనాయుడు **S/o.** (లేటు) అప్పలసూరి, వయస్సు : 66 సం॥లు. డోర్ నెం. 1-50, కొత్తపేట రోడ్, కలెక్టర్ ఆఫీసు ఎదురుగా, శ్రీకాకుళంజిల్లా. ఆంధ్రప్రదేశ్-532001.

నేను చిలకపాలేం గ్రామం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళంజిల్లాలో పొన్నాడ కృష్ణమూర్తి **S/o.**(లేటు) అప్పలస్వామి దగ్గర నుండి కొనుగోలు చేసిన స్థలం విస్తీర్ణం య. 0-76 సెంట్లు, పాత సర్వే నెంబరు 113/11P, కొత్త సర్వే నెంబర్ 113/25 గల స్థలమును కొనుగోలుచేసిన **ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెంబర్ 51/1982, పొందూరు,S.R.O.,** మా ఇంటి నుండి జిరాక్సు కోసం వెళ్తుండగా మార్గమధ్యలో శ్రీకాకుళం **O.B.S.** దగ్గర పడిపోయినవి. ఎవరికి అయినా దొరికిన యెడల 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో గాని ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు గాని తెలియజేయగలరు.

**ఫోన్ నెంబర్ : 9000905399.**


డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

## మార్కెటింగ్ శాఖ ద్వారా
# టమాటా కొనుగోళ్లకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలకుండా అన్ని చర్యలు తీకుంటున్నామని తెలిపారు.

**సమస్యలు ఆలకిస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ**

కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వివిధ ప్రాంతాల నుంచి వినతులు ఇచ్చేందుకు ప్రజలు బారులు తీరారు. ప్రజల సమస్యలు ఆలకిస్తూ ఆప్యాయంగా పలకరిస్తూ, వాటి పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజల వినతులు తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

**ప్రధానంగా వచ్చిన వినతులు**

అగ్రిగోల్డ్ సంస్థ ఆర్థిక మోసాల కారణంగా వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తమకు న్యాయం చేయాలని వినతి ప్రత్రం అంజేశారు. వ్యవసాయ విద్యుత్‌కనెక్షల్లు మంజూరుచేయాలని పలు గ్రామాల రైతులు వినతి పత్రం అంజేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నూతన కనెక్షన్లు మంజూరుకు చర్యలు తీసుకున్నామని, జిల్లాలోని త్వరలోనే మంజూరు చేస్తామని మంత్రి వివరించారు. తమ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మంత్రికి రైతులు వినతి పత్రం అందించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# భాష - సంస్కృతి అవిభాజ్యం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భాష-సంస్కృతి విడదీయలేనివని ప్రముఖ అష్టావధాని విద్వాన్ పైడి హరనాథరావు అన్నారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల తెలుగు విభాగం శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒక జాతి సాహిత్యంలో ఆ జాతి నాగరికత, ప్రాంత ప్రాధాన్యతలు, సంప్రదాయాలు సమ్మేళనగా ఉంటాయన్నారు. వేదాలు, ప్రాచీన కావ్యాలు ఈ తరం చదవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పులఖండం శ్రీనివాసరావు భాషా దినోత్సవం ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాదిపతి భమిడిపాటి గౌరిశంకర్, అప్పలనాయుడు, గోపాలరావు, ధన్వంతరీ, ఉమామహేశ్వరీ, మహేష్ పాల్గొన్నారు.

## తల్లికి వందనం, రైతుభరోసాపై
# ప్రభుత్వం తాజా నిర్ణయం..!!



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ ప్రభుత్వం హామీల అమలు దిశగా కసరత్తు చేస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ హామీల పైన హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలవుతోంది. ఇక తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలుపై తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28న ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ రెండు పథకాలకు నిధుల కేటాయింపుతో పాటుగా అర్హతల మార్గదర్శకాలపై విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

బడ్జెట్‌లో కేటాయింపులు, సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కోసం నిధులు కేటాయించనున్నారు. జూన్‌లో తల్లికి వందనం, జూలైలో అన్నదాత సుఖీభవ అమలుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ఉగాది నుంచి అమలు చేయాలని తొలుత ప్రభుత్వం భావించింది. కానీ, ఇప్పుడు ఈ పథకం అమలులో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక తల్లికి వందనం అమల్లో భాగంగా అంచనాలను అధికారులు సిద్ధం చేసారు. ఎంతమంది పిల్లలు ఉన్నా ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో వేసేలా ఇచ్చిన హామీ అమలుపై బడ్జెట్‌లో ప్రతిపాదనలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



**పథకాలు - నిధులు**

తల్లికి వందనం పథకం కోసం తాజా లెక్కల మేరకు 69.16 లక్షల మంది అర్హులుగా గుర్తించారు. వీరికి పథకం అమలు చేయాలంటే దాదాపు రూ. 10,300 కోట్లు అవసరమని తేల్చారు. అర్హతల ఖరారుపై తుది కసరత్తు కొనసాగుతోంది. ఇక, ప్రతీ రైతుకు ఏటా ఇస్తామని చెప్పిన హామీ మేరకు రూ.20 వేలు ఇచ్చేలా హామీ ఇచ్చిన అన్నదాత సుఖీభవ కోసం రాష్ట్రంలో అర్హత ఉన్న రైతుల సంఖ్య 53.58 లక్షలుగా గుర్తించారు. ఒక్కో రైతుకు రూ.20 వేలు చొప్పున చెల్లించేందుకు కావాల్సిన మొత్తం రూ. 10,717 కోట్లు. కాగా, పీఎం కిసాన్ కింద కేంద్రం ఇచ్చే రూ.6 వేలు మినహాయింపు చేయనున్నారు. ఈ లెక్కన ఒక్కో రైతుకు ఏడాదికి రూ.14 వేలు చొప్పున చెల్లిస్తే ఇందుకోసం రూ.14 వేల చొప్పున ఇస్తే కావాల్సిన మొత్తం రూ.7,502 కోట్లు అని తేల్చారు. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో చెల్లించేలా ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది స్పష్టత రావాల్సి ఉంది.

# భయపెట్టుకో.. బేరం కుదుర్చుకో!

(మొదటిపేజీ తరువాయి)

వినికిడి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో వివిధ పీహెచ్‌సీల్లో డాక్టర్లుగా పని చేస్తున్న 19 మంది మెడికల్ ఆఫీసర్లకు ఈమధ్య పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడానికి సీట్లు వచ్చాయి. వీరందర్నీ రిలీవ్ చేయాలి. అయితే వీరి నుంచి డీఎంహెచ్‌వోకు రూ.10వేలు, మెడికల్ డైరెక్టరేట్‌కు రూ.10వేలు, తనకు రూ.3వేలు ఇవ్వాలని చెప్పి ఈ 19 మంది నుంచి పెద్ద మొత్తంలో సొమ్ములు వసూలు చేసి వారి ఎస్ఆర్‌లతో ప్రస్తుతం డాక్టర్ బి.రవీంద్ర డైరెక్టరేట్‌కు వెళ్లినట్లు తెలుస్తుంది. డాక్టర్లు సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలంటే రూ.10వేలు స్వయంగా ఒక డాక్టరైవుండి రవీంద్రే వసూలు చేస్తున్నారట. మరీ విచిత్రమేమిటంటే.. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో మెడికల్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నవారికి యూనియన్ నాయకుడిగా ఉన్న వైద్యుడి నుంచే డాక్టర్ రవీంద్ర రూ.10వేలు ముక్కుపిండి వసూలు చేశారని భోగట్టా. కుసిమి పీహెచ్‌సీలో రెండవ మెడికల్ ఆఫీసర్‌గా పని చేసినప్పుడు అక్కడ ఫార్మసిస్ట్ నుంచి రూ.70వేలు, ఏఎన్ఎం నుంచి రూ.50వేలు అప్పు తీసుకోవడం వల్ల ఈయన్ను ఎల్‌హెచ్ఎం ప్రాజెక్టుకు డీపీఎంవోగా ఫారమ్ సర్వీస్‌కు వెళ్లినప్పుడు అక్కడ మొదటి మెడికల్ ఆఫీసర్ ఈయన్ను రిలీవ్ చేయలేదు. అప్పట్నుంచి తనకు రాజకీయ పలుకుబడి ఉందని, ఇక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు తమ సామాజికవర్గానికే చెందినవారని రుబాబు చేస్తూ ఇక్కడ పబ్బం గడిపేస్తున్నారు. అసలు తనకు సంబంధం లేని ప్రాజెక్టులు, పీహెచ్‌సీలను తనిఖీలు చేసి సొమ్ములు వసూలు చేయడం వెనుక డీఎంహెచ్‌వో పాత్ర ప్రధానమైనది. డాక్టర్ రవీంద్ర అర్బన్ పీహెచ్‌సీలతో పాటు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను కూడా పర్యవేక్షిస్తుంటారు. దీన్నే పూర్వం హెల్త్ సబ్ సెంటర్లనేవారు. దానికి పేరు మార్చడం వల్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ అయింది. ప్రస్తుతం జిల్లాలో 472 కేంద్రాలు ఉన్నాయి. వీటన్నింటికీ ఇప్పుడు కొత్త పేరుతో బోర్డు పెట్టాలి. దీనికోసం ఒక్కో కేంద్రానికి రూ.5వేలు కేటాయించారు. ఒక ఫ్లెక్సీ కట్టడానికి ఎంతవుతుందో వేరేగా చెప్పనక్కర్లేదు. అలాగే అర్బన్ హెల్త్ సెంటర్లకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అని ఒకటుంటుంది. గత ప్రభుత్వం దీన్ని నిర్వహించడానికి ఏడాదికి రూ.25వేలు బడ్జెట్ కేటాయించేది. దీన్ని కొత్తగా లక్షకు పెంచారు. అంతే.. డీపీఎంవో రవీంద్ర ఛాంబర్ ఖాళీ ఉండటంలేదు. అర్బన్ పీహెచ్‌సీ క్లీనింగ్‌కు రూ.400 అయిందని బిల్లు పెడితే, పక్కన ఒక సున్నా చేర్చి రూ.4వేలు, అర్జంట్ మెడిసిన్ కొనుగోలు కింద వేలకు వేలు, డ్రింకింగ్ వాటర్ సదుపాయం కింద వేలకు వేలు దొంగబిల్లులు పెట్టించి వీటిని విత్‌డ్రా చేయించడంలో బిజీగా ఉన్నారు.

**అసలు కొత్త డీఎంహెచ్‌వోకు, డీపీఎంవోకు లింక్ ఎలా కుదిరింది? జిల్లాలో అందరి మీదా ఈయనెందుకు రుబాబు చేస్తున్నాడు? ఫోన్‌పేల ద్వారా ఎవరికి సొమ్ములెల్తున్నాయ్? వంటి అంశాలతో మళ్లీ కలుద్దాం.**

# ప్రజల సమస్యలకు పరిష్కారం కమ్యూనిస్టు ప్రణాళిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ పరిష్కార మార్గం చూపించేది కమ్యూనిస్టు ప్రణాళికని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, బి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహన్‌రావు అధ్యక్షతన ఇంటర్నేషనల్ రెడ్‌బుక్ డే నిర్వహించారు. 1848 ఫిబ్రవరి 21న మార్క్స్, ఏంగిల్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక విడుదలయిందని, అందువల్ల ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 21న రెడ్ బుక్ డే నిర్వహిస్తున్నారని, అందులో భాగంగానే శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కమ్యూనిస్టు ప్రణాళిక ద్వారా దోపిడీ లేని, అందరికీ అన్ని అవకాశాలు ఉండే సమాజం ఉందని, అదే సోషలిస్టు సమాజమని తెలిపారు. అందరికీ అన్ని అవకాశాలు ఉండే సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ధనంతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలు బ్యాంకులు, ఇన్సూరెన్స్, పోర్టులు, రోడ్లు, ఆయిల్, గనులు, రైల్వే, విద్యుత్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, ప్రజల ఆస్తులు సైతం కార్పొరేట్ ఆస్తులుగా మార్చేస్తున్నారని విమర్శించారు. సముద్ర తీర ప్రాంతాల్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమస్యల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి, పార్టీ నాయకులు కొత్తకోట అప్పారావు, కె.సూరయ్య, ఎం.గోపి, ఆర్.ప్రకాష్, ఎ.సత్యం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి స్థానంలో ఉండి అబద్ధాలు తగదు

**- మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్**



(సత్యంన్యూస్, నరసన్నపేట)

వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సంబంధించిన అన్ని శాఖలకు మంత్రి స్థానంలో ఉండి కింజరాపు అచ్చెన్నాయుడు అబద్ధాలు చెప్పడం తగదని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ మిర్చి రైతులు గిట్టుబాటు ధరలు లేక సతమతమవుతుంటే గత ప్రభుత్వంలో రేటు పలికిందా? అని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవంగా వైకాపా ప్రభుత్వంలో మిర్చికి మార్కెట్లో రూ.27వేల వరకు గరిష్టంగా ధర పలికిందని గుర్తు చేశారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక చర్యగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించని మిర్చి సహా ఇతర పంటలకూ జగన్ ప్రభుత్వం ఎంఎస్పీని ప్రకటించిందని, ఐదేళ్ల తర్వాత ఇప్పటి రేట్లతో పోలుస్తున్న మంత్రి అచ్చెన్నాయుడిని ఏమనాలని వైకాపా తరఫున సూటిగా ప్రశ్నించారు. వైకాపాపై తప్పుడు ప్రచారాలు మాని రైతులను ఆదుకోవడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# భాషా వారసత్వాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నాణ్యమైన చదువులకు మాతృభాష మాత్రమే శరణ్యమని, భాషా వారసత్వాన్ని సంరక్షించడం ద్వారా విద్యా ప్రగతికి బాటలు వేసేవారమవుతామని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కొంక్యాన మురళీధర్, పీజీ గుప్తా, గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు అన్నారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో 25వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మనిషి జీవితంలో మొదట నేర్చుకొనే భాష మాతృభాష మాత్రమేనని స్పష్టం చేశారు. అమ్మ మాటే మాతృభాష అని, అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకుంటే మాతృభాషను కూడా కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు. మానవ మనుగడకు ఇతర భాషలు నేర్చుకోవడం తప్పులేదని, అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా తెలుగు భాషను కాపాడుకోవడం గురుతర బాధ్యతగా గుర్తించి నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బీవీ రవిశంకర్, గేదెల లక్ష్మీ, రాంబాయి, నందిగామ కామేశ్వరరావు, గుడ్ల జగ్గారావు, సుగంధం సంజీవరావు, మెట్ట ధనుంజయ భట్లు, గురు ఆనందరావు, ఎండ మోహన్, ఎం.మల్లిబాబు పాల్గొన్నారు.

# ఆడపిల్లకు అండగా 'ఆడపిల్ల సేవా సొసైటీ'



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆడపిల్లలకు అండగా నిలుస్తామని ఆడపిల్ల సేవా సొసైటీ అధ్యక్షురాలు, పొందూరు సచివాలయ ఉద్యోగి మడ్డి లావణ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండలవీధిలో నివాసముంటున్న లీలారాణి నిరుపేద కుటుంబానికి చెందిన విషయం విదితమే. తల్లి మరణించగా, తండి దీర్ఘకాలిక లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యారు. లీలారాణి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ, తండ్రికి చేదోడుగా నిలుస్తుంది. గతంలో ఆమె కుటుంబానికి సేవకులు ఉర్లం శివతేజ అందించిన సమాచారంతో పెదపాడుకు చెందిన బొట్టా సాయికుమార్ నిత్యావసర సరుకులను అందించగా, నగరానికి చెందిన ట్రెజరీ హెల్పింగ్ హాండ్స్ ద్వారా మాదారపు డేవిడ్, బెహరా ప్రదీప్ బృందం అమ్మాయి పేరున రూ.10వేలు ఫిక్సిడ్ డిపాజిట్ చేసి ఆదుకున్నారు. అయితే తండ్రి మంచం పట్టడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఇంటి అద్దె కట్టడానికి కూడా స్తోమత లేకపోవటంతో విషయాన్ని శివతేజ ద్వారా తెలుసుకున్న ఆడపిల్ల సేవ సొసైటీ మడ్డి లావణ్య ప్రతినెలా ఇంటి అద్దె కట్టడానికి ముందుకు వచ్చి, శుక్రవారం రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను అందించారు. అనంతరం మాట్లాడుతూ ఆడపిల్లలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆడపిల్ల సేవ సొసైటీ స్థాపించామని, అటువంటి విద్యార్థులకు, పిల్లలకు ఎటువంటి సహాయక కావాలన్నా తమవంతు సాయమందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆడపిల్ల సేవ సొసైటీ సభ్యులు డాక్టర్ పైడి ప్రదీప్, సేవకులు ఉర్లం శివతేజ, మండలవీధికి చెందిన బి.వినయ్ కుమార్, విద్యార్థిని లీలారాణి పాల్గొన్నారు.

# అంకితభావంతో పని చేస్తా



(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షునిగా తనను నియమించినందుకు పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పజెప్పిన బాధ్యతలను అంకితభావంతో పనిచేసి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైకాపా పటిష్టకు కృషి చేస్తానని అన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రజాసేవ చేస్తున్న కుటుంబం నుంచి వచ్చిన ఐదోతరం వాడిగా కొనసాగుతున్నానని, అందుకు నిరంతరం వెన్నంటే ఉంటూ వెన్నుతట్టి ప్రోత్సహించిన ఈదుపురం ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. తనను నియమించడంపై ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన క్రిష్ణదాసు, ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారామ్, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా విజయ, మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.






Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.